
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల జిల్లా వార్తలు
శనివారం 3 మే 2025

రేషన్ కార్డులు వచ్చేశాయి..

- మీ సేవ కేంద్రాల చుట్టూ దరఖాస్తుదారుల ప్రదక్షిణలు
- 9,731 కుటుంబాలు మాత్రమే గుర్తింపు
- పదేళ్లుగా రేషన్ కార్డులకు ఎదురుచూపులు
- జిల్లాలో 1,73,578 రేషన్ కార్డులు



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఎన్నో ఏళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న అర్హుల నిరీక్షణకు తెరపడింది. పేదలకు రేషన్ కార్డులను జారీ చేసింది. ఇటీవల కుల గణన ద్వారా చేపట్టిన సర్వే అధారంగా గుర్తించిన వారికి, అలాగే మీ సేవలో దరఖాస్తులు చేసుకున్న వారి అర్హతలపై కుటుంబాలను గుర్తించి జనవరి మాసంలో సర్వేలు చేశారు. దానికి అనుగుణంగా రేషన్ కార్డులు జారీ కావడంతో మీ సేవ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తుదారులు మంజూరీని చూసుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించడమే కాకుండా నిరంతర ప్రక్రియగా ఉంటుందని చెప్పారు. క్షేత్రస్థాయిలో సర్వేలు చేసి ఆన్‌లైన్ ద్వారా మంజూరీ ఇచ్చారు. ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులతో పాటు మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది. కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 2023 డిసెంబరు 26 నుంచి 2024 జనవరి 8 వరకు ఆరు గ్యారంటీల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. ఆరు గ్యారంటీల్లో రేషన్ కార్డు ఆప్షన్ లేకపోయినా అదనంగా దరఖాస్తులను స్వీకరించారు. ఆరు గ్యారంటీల్లో 1.91 లక్షల దరఖాస్తులు రాగా, 40 వేల మంది రేషన్ కార్డులు, మార్పులు, చేర్పులకు దరఖాస్తులు చేసుకున్నారు. అందరికి కార్డులు వస్తాయని ఎదురుచూసిన క్రమంలో ఈ సంవత్సరం జనవరిలో 9,731 మంది తెల్ల రేషన్ కార్డులకు అర్హులుగా గుర్తించి మంజూరు చేశారు.

● చేర్పులు, మార్పులపై అయోమయం..

కొత్తగా రేషన్‌కార్డులు జారీ అయిన నేపథ్యంలో జిల్లాలో దరఖాస్తుదారుల్లో తెల్ల రేషన్‌కార్డు లేనివారిని 9,731 మంది కుటుంబాలను గుర్తించారు. జనవరిలోనే కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టినా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం మే నుంచే బియ్యాన్ని పంపిణీచేసే దిశగా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం జిల్లాలో బోయినపల్లిలో 553, చందుర్తిలో655, ఇల్లంతకుంటలో 903, గంభీరావుపేటలో 717, కోనరావుపేటలో 836, ముస్తాబాద్‌లో 903, రుద్రంగిలో 914, సిరిసిల్లలో 1420, తంగళ్లపల్లిలో 710, వీర్నపల్లిలో 217, వేములవాడ అర్బన్‌లో 819, వేములవాడలో421, వేములవాడరూరల్‌లో 496, ఎల్లారెడ్డి పేటలో 767కుటుంబాలకు కార్డులు అందించే దిశగా సర్వేచేసి మీ సేవ ద్వారా ఆహార భద్రత కార్డుల మంజూరు పత్రాలను అందుబాటులో ఉంచారు.

● త్వరలో స్మార్ట్ కార్డులు..

ప్రభుత్వం ఆహార భద్రత కార్డుల ద్వారా కుటుంబంలోని మూడేళ్ల వయస్సు దాటిన వారందరికి 6 కిలోల ఉచిత బియ్యాన్ని అందిస్తుంది. గత ప్రభుత్వం ఆహారభద్రత కార్డులుగా పేరు మార్చినప్పటికి లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులను త్వరలో స్మార్ట్ కార్డులుగా జారీ చేస్తామని ప్రకటించారు. ఇప్పటి వరకు రేషన్ పత్రాలను జిరాక్స్ చేయించుకొని బియ్యం పొందుతున్నారు. త్వరలోనే డిజిటల్‌కార్డులు జారీ అవుతాయని భావిస్తున్నారు.

జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో కొత్త కార్డులు రాకపోగా కనీసం ఉన్న కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చకపోవడం, చేర్పులు, మార్పులు కూడా జరుగలేదు. జిల్లాలో చేర్పులు, మార్పులకు సంబంధించిన 20,606 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. రేషన్ కార్డుల్లో పిల్లల పేర్లు, కోడళ్ల పేర్లు చేర్చాలంటూ వేలాది మంది కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు ఈ నేపథ్యంలో కొత్త రేషన్ కార్డుల జారీతో పాటు చేర్పులు, మార్పులు పూర్తిస్థాయిలో జరగలేదనే విమర్శలు ఉన్నాయి. మీ సేవ కేంద్రాల్లో మార్పులు కనిపించకపోవడంతో మళ్లీ ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో చేర్పుల మార్పుల దరఖాస్తుల పెండింగ్‌లో బోయినపల్లిలో 1,321, చందుర్తిలో 1,760, కోనరావుపేటలో 1,403, ముస్తాబాద్ 1,914, రుద్రంగిలో 948, సిరిసిల్లలో 2,689, తంగళ్లపల్లిలో 1,333, వీర్నపల్లిలో 481, వేములవాడ రూరల్‌లో 1,105, వేములవాడలో 2,105, ఎల్లారెడ్డిపేటలో 2,032 దరఖాస్తులు ఉన్నాయి. 2018 సంవత్సరానికి ముందు దరఖాస్తులు చేసుకున్న వారిలో 2021 ఆగస్టులో 2,271 మందికి రేషన్ కార్డులు అందించారు. ఆ తరువాత మళ్లీ రేషన్ కార్డులు జారీ చేయడం చేర్పులు, మార్పులు పక్రియ ముందుకు రావడంతో లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

● జిల్లాలో 5,22,967 మంది లబ్ధిదారులు...

రాజన్న సిరిసిల జిల్లాలో 1,74,304 రేషన్ కార్డులు ఉండగా లబ్ధిదారులు 5,22,967 మంది ఉన్నారు. ఇందులో అంత్యోదయ కార్డులు 13,752, ఆహార భద్రత కార్డులు 1,60,349 కార్డులు, అంత్యోదయ అన్నయోజన కార్డులు 203 ఉన్నాయి. వీటి పరిధిలో 5,22,967 మంది లబ్ధిదారులు ఉన్నారు. అంత్యోదయ లబ్ధిదారులు 37,453మంది, ఆహారభద్రత లబ్ధిదారులు 4,85,308 మంది, అన్నయోజన లబ్ధిదారులు 206 మంది ఉన్నారు.

ఎండలతో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్ మే 2 (ఆంధ్రజ్యోతి) : ఎండలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. ఎండలు, వడగాలులతో జరిగే ప్రమాదాలుపై ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని ఒక ప్రకటన జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నాయని, అకాల వర్షాల వల్ల భూమి నుంచి వేడి వస్తుందని, ఎండ తీవ్రత కూడా అధికంగా ఉంటున్నందున ఎండదెబ్బ తగలకుండా ప్రజలు ఆరోగ్య సంరక్షణ చర్యలు పాటించాలని సూచించారు. ఎండబారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని, ఎండ అధికంగా ఉన్న సమయాల్లో బయటకు వెళ్లకుండా ఉండాలని తెలిపారు. అత్యవసర పరిస్థితి అయితే తప్ప ప్రజలు బయటికి రాకూడదని, ఉదయం 11నుంచి సాయంత్రం 4గంటల మధ్య ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బలు, ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని స్పష్టం చేశారు. వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. చిన్నారులు, వయోవృద్ధులతో ప్రయాణం శ్రేయస్కరం కాదని, ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఇంటి నుంచి బయటికి వస్తే తలకు ఎండ తగలకుండా గొడుగు, కండువా, టోపీతో కవరు చేయాలని సూచించారు. తాగునీరు అధికంగా తీసుకోవాలని తీసుకోవాలని, వదులుగా ఉన్న కాటన్ దుస్తులను ధరించాలని తెలిపారు. ఎండ అధికంగా ఉన్న సమయాల్లో దూర ప్రయాణాలు చేయకూడదని తెలిపారు. వడదెబ్బకు గురికాకుండా తరచుగా ఓఆర్ఎస్ ద్రావణం, మజ్జిగ, నిమ్మరసం తీసుకోవాలని తద్వారా వడదెబ్బ నుంచి ఉపశమనం ఉంటుందని అన్నారు. ఎండలు వల్ల చర్మంపై ఎర్రటి దద్దుర్లు, పొడిబారడం లాంటి మార్పులను ప్రజలు గమనించాలని తెలిపారు. వేడివల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుందని, అలసట, నోరు ఎండిపోవడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయక తక్షణమే సమీప ప్రభుత్వ ఆసుపత్రులల్లో వైద్య సేవలు పొందాలని తెలిపారు. అత్యవసర వైద్య సేవలకు 108కు ఫోన్ చేయాలన్నారు. ఉపాధిహామీ పథకం పనులు కూలీలు ఉదయం 6 నుంచి 11గంటల వరకు, సాయంత్రం 4నుంచి 6గంటలు వరకు పనులు చేపించాలని, పనులు జరుతున్న ప్రదేశాల్లో రక్షణ, జాగ్రత్తలు పాటించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

మొక్కులు చెల్లించుకున్న ప్రభుత్వ విప్



దుర్గమ్మకు మొక్కులు చెల్లించుకుంటున్న ఆది శ్రీనివాస్

రుద్రంగి, మే 2(ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నర్సింహస్వామి, ముత్యాల పోచమ్మ, దుర్గమ్మ ఆలయాల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే ఎన్నికల సమయంలో ఆది శ్రీనివాస్ గెలుపు కోసం కాంగ్రెస్ నాయకులు గ్రామంలోని దేవతలకు ముడుపులు కట్టగా, శుక్రవారం మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, కోమిరె శంకర్, కెసిరెడ్డి నర్సరెడ్డి, తర్రె లింగం, ఎర్రం రాజలింగం, గడ్డం స్వామి, మాడిశెట్టి అభిలాష్, ఆకుల గగన్, పిడుగు లచ్చిరెడ్డి, గుగ్గిళ్ల వెంకటేశం, సిరికొండ రవి, అల్లూరి సంతోష్‌రెడ్డి, పూదరి మహిపాల్ పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన

వేములవాడ, మే 2 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం కోసం వచ్చిన దరఖాస్తులను వేములవాడ పురపాలక సంఘం కార్యాలయంలో బ్యాంక్ అధికారులు, మున్సిపల్ అధికారులు కలిసి శుక్రవారం పరిశీలించారు. ఆరవ వార్డు నుంచి పదో వార్డు పరిధిలో అందిన దరఖాస్తులను వార్డు అధికారులతో కలిసి ఎస్బీఐ, యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారులు పరిశీలించినట్లు మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తెలిపారు.

రాజీవ్ యువ వికాసం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

రుద్రంగి, మే 2 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలను శుక్రవారం ఎంపీడీవో నట రాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం రుణాల కోసం మండలంలోని గ్రామాల వారిగా దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుధాకర్, యూనియన్ బ్యాంక్ అధికారులు, దరఖాస్తు దారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్'

- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట, మే 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయ పేర్కొన్నారు. మండలంలోని అనంతారం గ్రామంలో శుక్రవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించాలనే లక్ష్యంతో వారంలో మూడు రోజుల పాటు అధికారులంతా కలిసి గ్రామాలకు వస్తారని తెలిపారు. ప్రత్యేక యాప్ ద్వారా నియోజకవర్గంలోని 2.28లక్షల మంది ఓటర్ల ఐడీకి ఈయాప్‌ను అనుసంధానం చేశామని పేర్కొన్నారు. సమస్యలను నేరుగా అప్‌లోడ్ చేస్తే అధికారుల బృందం పరిశీలించి పరిష్కరిస్తుందని తెలిపారు. అనంతారంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు నిధులు కావాలని గ్రామస్థులు కోరగా కలెక్టర్ మంజూరు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ సుదర్శన్‌రెడ్డి, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో శశికళ, ఎంపీవో శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, నాయకులు ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, పసుల వెంకటి, చల్ల నారాయణ, తీగల పుష్పలత, చొప్పరి అశోక్, మచ్చ రాజేశం, బడుగు లింగం, ప్రసాద్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో



నిమ్మపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కోనరావుపేట, మే 2 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం నిమ్మపల్లి ఎక్స్ రోడ్డుపై బీఆర్ఎస్ నాయకులు ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని నిరసన వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించి శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకపోయాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయడంలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, మాజీ ఎంపీపీ చంద్రయ్యగౌడ్, కెంద గంగాధర్, మంతెన సంతోష్, రమణారెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు నిర్వహించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, మే 2 (ఆంధ్రజ్యోతి) : భూభారతి చట్టం ప్రకారం ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవడంతోపాటు ఈనెల 5 నుంచి 20వ తేదీవరకు జిల్లాలోని అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి మంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్వహించగా కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో భూ భారతి చట్టం, రెవెన్యూ సదస్సులు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈనెల 5నుంచి 20వ తేదీ వరకు పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని జిల్లా కేంద్రాలను మినహాయించి జిల్లాలో ఒక మండలాన్ని పైలెట్‌గా తీసుకుని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులను తీసుకోవాలన్నారు. జూన్ 2వరకు పైలెట్ ప్రాజెక్ట్ కింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. భూ భారతి చట్టంలో దరఖాస్తు చేసుకునే సమయంలో సరిగ్గా దరఖాస్తులు నమోదు అయ్యేలా హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటుచేయాలన్నారు. ప్రభుత్వ భూముల్లో పొజిషన్‌లో ఉన్న రైతుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, భూమి లేని నిరుపేదలు పొజిషన్‌లో ఉంటే వారికి పట్టాలు ఇచ్చేందుకు సీఎం చర్చించి సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. పట్టాలు ఉండి పొజిషన్‌లో లేని దరఖాస్తులు కూడా పరిశీలించాలన్నారు. హైకోర్టు అనుమతులు రాగానే సాదాబైనామా దరఖాస్తులను పరిష్కారం చేయాలని, దీనికి అవసరమైన కార్యాచరణను పూర్తిచేయాలన్నారు. ఈ నెల చివరికల్లా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తప్పులులేకుండా పరిష్కారం చూపాలన్నారు. గతంలో పంపిణీ చేసిన ప్రభుత్వ భూముల పట్టాలు ఎవరైనా విక్రయిస్తే ముందు ఆ పట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలన్నారు. కొనుగోలు చేసిన వారు భూమి లేని నిరుపేద అయితే ప్రభుత్వంతో చర్చించి ఎంత భూమి క్రమబద్ధీకరించాలి అనే అంశంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. అటవీ భూముల వివాదాల పరిష్కారానికి కూడా కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అర్బన్ పీఎం ఆవాస్ యోజన కింద ఇళ్లు మంజూరయ్యాయని పట్టణ ప్రాంతాల్లో కనీసం 500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చూడాలన్నారు. పీఎంఎల్‌పి పోర్టల్‌లో లబ్ధిదారుల ధ్రువీకరణ ఆధార్ నంబర్‌లతో పూర్తిచేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, డీఆర్‌డీవో శేషాద్రి, హౌసింగ్ పీడీ శంకర్‌లతో అధికారులు పాల్గొన్నారు.

కార్మికులు, ఆసాముల కూలి నిర్ణయించాలి

- సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి

సిరిసిల్ల టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : పెరిగిన ధరలకు అనుగుణంగా పవర్‌లూం కార్మికులు, ఆసాముల కూలి నిర్ణయించాలని సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పవర్‌లూం కార్మికులను, ఆసాములను విస్మరిస్తూ యజమానులకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుంటుందని ఆరోపించారు. నాలుగు సంవత్సరాల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరలకు ఇచ్చిన కూలినే మళ్లీ ఇందిరా మహిళా శక్తి చీరలకు కూడా అదే కూలిని కార్మికులకు, ఆసాములకు కలిపి 11రూపాయలు ఇవ్వడం దుర్మార్గమన్నారు. గతంలో సిరిసిల్లలో ఉత్పత్తి అయిన బతుకమ్మ చీరల్లో యజమానులు చాలా లబ్ధి పొందరాని నాటి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎన్నోసార్లు అసెంబ్లీ సాక్షిగా ప్రస్తావించారని ఆ విషయాన్ని మరిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ యజమానులకు అనుకూలంగా వ్యవహరించడం పవర్‌లూం కార్మికులు, ఆసాముల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని భావిస్తున్నామన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం ఉన్న కూలినే ఇప్పుడు కూడా ఇవ్వాలని చేనేత జౌళిశాఖ అధికారులు నిర్ణయాలు తీసుకోవడం సరైన విధానం కాదని విమర్శించారు. యజమానులకు వచ్చే లాభాల నుంచి రెండు రూపాయలు తగ్గించి కార్మికులకు, ఆసాములకు చెందే విధంగా చేనేత, జౌళిశాఖ అధికారులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం బతుకమ్మ చీరలకు ఇవ్వాల్సిన బకాయిలన్నీ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం యజమానులకు చెల్లించింది కాని కార్మికులకు రావాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీ ఊసెత్తకపోవడం బాధాకరమన్నారు. యజమానులకు కోట్ల రూపాయల బకాయిలు చెల్లించి కార్మికులకు రావాల్సిన 10శాతం యారన్ సబ్సిడీ ఇవ్వకపోవడం బట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరి వైపో స్పష్టమవుతుందన్నారు. ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తి చేస్తున్న కార్మికులకు ఒక మీటర్‌కు ఆరు రూపాయాలు, ఆసాములకు ఏడు రూపాయాలు అందే విధంగా ప్రభుత్వం, చేనేత, జౌళి శాఖ అధికారులు నిర్ణయం తీసుకోవాలని అదే విధంగా 10 శాతం యారన్ సబ్సిడీ బకాయిలను కార్మికుల ఖాతాలలో జమచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, చేనేత జౌళిశాఖ అధికారులు దీనిపై స్పందించని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న ఆందోళనలను చేపడతామని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు నల్ల చంద్రమౌళి, అజ్జ వేణు, గాజుల లింగం, జంగం జనార్ధన్, సదానందం, రాయమల్లు పాల్గొన్నారు.



కులగణనలో ఆదర్శంగా నిలిచిన రాష్ట్రం

- టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : కులగణన జరిపి దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారత దేశానికే ఆచరణాత్మకంగా నిలిచాడని టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్రలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వివిధ రాష్ట్రాలు వివిధ వర్గాలకు చెందిన ప్రజలను పలకరిస్తూ వారి ఆకాంక్షలను తెలుసుకుంటూ దేశ అభివృద్ధి కోసం ఆలోచించి జనగణనతో పాటు కుల గణన జరగాలని ఎవరి లెక్క ఎంతో తేలాలని నినదించాడన్నారు. రాహుల్‌గాంధీ అభిప్రాయంతో కాంగ్రెస్ పాలిత రాష్ట్రమైన తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కులగణన జరిపి అసెంబ్లీలో తీర్మానం చేసి గవర్నర్ ద్వారా ఆమోదింపచేసి కేంద్రానికి పంపించడం జరిగిందన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని బీసీ సంఘాలను కూడగట్టుకొని ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలసి దేశ రాజధాని జంతర్‌మంతర్ వద్ద బీసీ కులగణన జరిపించాలంటూ ఆందోళన చేపట్టి షెడ్యూల్ 9లో చేర్చాలని డిమాండ్ చేశారన్నారు. ఈ పరిణామాలను గ్రహించిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ దేశవ్యాప్తంగా వస్తున్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని కుల గణన చేపడతామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. దేశ ప్రజల సంక్షేమం కోరుతూ సమాన హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో పోరాటం చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డికే ఈ ఘనత దక్కుతుందన్నారు. సహకరించిన ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలకు, బీసీ సంఘాలకు కాంగ్రెస్ పార్టీ పక్షాణ కృతజ్ఞ తలు తెలిపారు.సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంగళ అశోక్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అహ్మద్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నీలి రవీందర్, మాజీ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, నాయకులు చుక్క శేఖర్, తాటికొండ శ్రీనివాస్, అడ్డగట్ల శంకర్, పైసా అంజనేయులు, గుజ్జె రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వేములవాడ టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగళపల్లి ఎంపీడీవో లక్ష్మీనారాయణ విధులు ముగించుకుని తిరిగి తన కారులో వేములవాడ మీదుగా జగిత్యాల వెళుతుండగా వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన జైపాల్‌రెడ్డి అనేవ్యక్తి వట్టేంల నుంచి వేములవాడ వైపు తన ద్విచక్రవాహనంపై వస్తున్న క్రమంలో శాత్రాజుపల్లి గ్రామ శివారులో ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలుకాగా ఎంపీడీవో ప్రమాదం నుంచి బయటపడినట్లు తెలిపారు.



ఉరివేసుకొని వృద్ధుడి బలవన్మరణం

మానకొండూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన పోలం పోచాలు(76) శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. పోచంపల్లికి చెందిన పోచాలుకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉండగా అందరికి వివాహాలు జరిగాయి. ఇద్దరు కుమారులు కరీంనగర్‌లో ఉంటున్నారు. పోచాలు కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని పలు ఆసుపత్రులలో చికిత్స చేయించారు. అయినా కడుపు నొప్పి తగ్గలేదు. దీంతో ఇంటి ముందు గల బాత్ రూంలో ఇనుప రాడ్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి పెద్ద కుమారుడు రవి ఫిర్యాదు మేరకు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.

కుంటలో చేపలు పడుతూ ఒకరి మృతి

శంకరపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్‌పల్లి శివారులోని కుంటలో శుక్రవారం చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం కొల్లూరి చంద్రమౌళి(62), అతనిభార్య పొలంవద్దకు వెళ్లారు. పొలం సమీపంలో ఉండే చింతకుంటలో దంపతులు ఇద్దరు చీరను ఇరువైపులా పట్టుకొని కుంటలో చేపలు పడుతున్నారు. ఈ క్రమంలో చంద్రమౌళి చీరను పట్టుకొని నీటిలో ముందుకు నడుస్తూ ఉండగా ప్రమాదవశాత్తు కుంటలో ఉన్న లోతైన బురదగుంతలో పడి మునిగిపోయాడు. గమనించిన అతని భార్య సరమ్మ, ఇతరులు చీరతో లాగుతూ బయటకు తీసుకు వచ్చే సరికి అప్పటికే నీటిలో ఊపిరాడక మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేశవపట్నం ఎస్సై కొత్తపల్లి రవి సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

చెట్టుపై నుంచి పడి కార్మికుడి దుర్మరణం


యోగేశ్వర్ (ఫైల్)

జ్యోతినగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పర్మనెంటు టౌన్‌షిప్(పీటీఎస్)లో శుక్రవారం చెట్టుపైనుంచి కిందపడి యోగేశ్వర్ సునాని(45) అనే వలసకార్మికుడు మృతి చెందాడు. టౌన్‌షిప్‌లోని చైతన్య పాఠశాల ఆవరణలో ఎన్టీపీసీ నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం(జెమ్) ఏర్పాట్లకు సంబంధించి కాంట్రాక్టరు వద్ద యోగేశ్వర్ పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం భోజనవిరామ సమయంలో పక్కనేఉన్న ఒకక్వార్టర్స్‌లోని మామిడిచెట్టుకాయలు కోసేందుకు యోగేశ్వర్ చెట్టెక్కాడు. ప్రమాదవశాత్తు జారికిందపడగా తీవ్రంగా గాయపడిన అతడిని ఎన్టీపీసీ ఆసుపత్రికితరలించి చికిత్సచేస్తుండగా చనిపోయాడు.మృతుడు పీకే రామయ్య కాలనీలో నివాసం ఉంటున్నాడు. అతడికిభార్య, ముగ్గురు పిల్లలున్నారు. మృతుడి కుటుంబానికి 3.5లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియాతోపాటు అంత్యక్రియల కోసం రూ.50వేలు ఇచ్చేందుకు కాంట్రాక్టరుతో ఒప్పందం కుదిరింది. ఎన్టీపీసీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక లారీ ఢీకొని వ్యక్తి మృతి

పెద్దపల్లి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సబ్బితం గ్రామ పంచాయతీలో పనిచేసే మల్టిపర్పస్ వర్కర్ నర్సయ్య (51) ఇసుక లారీ ఢీకొని మృతిచెందాడు. గ్రామ పంచాయతీలో మల్టిపర్పస్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏడెళ్ల నర్సయ్య అనే కార్మికుడు శుక్రవారం పనులు పూర్తి చేసుకొని గ్రామ పంచాయతీ కార్యాలయానికి సైకిల్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో పెద్దపల్లి నుంచి మంథనికి ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీ వేగంగా ఢీకొనడంతో నర్సయ్య లారీ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని బసంత్‌నగర్ పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ప్లంబర్ మృతి

పెద్దపల్లిటౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): వృత్తిలో భాగంగా ఓ ఇంట్లో పని చేస్తుండగా కరెంట్ షాక్ గురై ప్లంబర్ శుక్రవారం మృతి చెందాడు పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన గజ్జెల శ్రీనివాస్ (45) పట్టణంలోని సుభాష్‌నగర్‌లో గోడలను కట్‌చేస్తుండగా అందులోఉన్న కరెంట్ వైర్‌కు విద్యుత్తు సరఫరా జరిగి షాక్‌తో కిందఉన్న రాళ్లపై పడ్డాడు. తల వెనుకభాగంలో బలంగా దెబ్బతగలడంతో మృతిచెందాడు. మృతుడి కూతురువైష్ణవి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసునమోదు చేసుకున్నారు.

భర్తపై హత్యాయత్నం చేసిన భార్య

ధర్మపురి, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుబ్బలగూడెం గ్రామానికిచెందిన తట్ల పోచంపై భార్య లక్ష్మి గురువారం హత్యాయత్నానికి పాల్పడింది. ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ కథనం ప్రకారం.. తట్ల పోచం నిత్యంతాగివచ్చి భార్యలక్ష్మితో గొడవపడుతుండేవాడు. ఈనెల1న తాగి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. భరించలేక భర్తను చంపాలనే ఉద్దేశంతో లక్ష్మి ఇంట్లోని బాడిశతో అతడితల, ముఖంపైన దాడిచేసింది. తీవ్రంగా గాయపడిన పోచంనుఆసుపత్రికి తరలించారు. పోచంకొడుకు మహేందర్ ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

బుగ్గారం, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన మ్యాదరవేని విజయ అనే మహిళా రైతుకు చెందిన గేదె శుక్రవారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. రైతు వివరాల మేరకు శుక్రవారం మేతకు వెళ్లిన గేదె విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఎర్త్ వైరుకు కరెంట్ సరఫరా కావడంతో అటుగా వెళ్లిన గేదెకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.85 వేలు ఉంటుందని తెలిపారు. ఇప్పటికే ఈప్రాంతంలో నలుగురు రైతుల గేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయని, పలుసార్లు విద్యుత్ అధికారులకు కంచె ఏర్పాటు చేయాలని విన్నవించుకున్న పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ కిందికి ఉండడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఇప్పటికైనా అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

ఉదయం వేళ
బస్సులు నడిపించరూ..

● ధర్మారం-కరీంనగర్ మధ్య ప్రయాణికుల ఇబ్బందులు ● ఉదయం 8 నుంచి 10 వరకు ఒకటే బస్సు ● బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్

సరైన సమయానికి ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యార్థులు కాలేజీలకు, ఉద్యోగులు అఫీసులకు వెళ్తుంటారు. ఈ సమయంలో ఆర్టీసీ బస్సుల్లేక విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



ధర్మారం, మే 2 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి రోజూ వేలాది మంది ప్రయాణిస్తుంటారు. పెద్దపల్లి, జగిత్యాల, లక్షెట్టిపేట నుంచి వచ్చే ప్రయాణికులకు ధర్మారం బస్టాండ్ సెంటర్ పాయింట్‌గా ఉంటుంది. ఈ రూట్లలో వచ్చే బస్సుల్లో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు ధర్మారం బస్టాండ్ చేరుకొని అక్కడి నుంచి కరీం నగర్‌లో వెళ్తారు. .

ధర్మారం, ఎండపల్లి, వెల్గటూర్ మండలాల నుం చి విద్యార్థులు కరీంనగర్‌లోని వివిధ కళాశాలలకు వెళ్తుంటారు. వీరంతా ఉదయం 9 గంటలకు కాలేజీలకు చేరుకోవడానికి గ్రామాల నుంచి 7 గంటల వరకు ధర్మారం బస్టాండ్ చేరుకుంటున్నారు.


ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సు

ధర్మారం బస్టాండ్ నుంచి 7 గంటలకు ఒక బస్సు ఉండగా దాని తరువాత 9.20 నిమిషాల వరకు బస్సు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 7 నుంచి 9 గంటల మధ్యలో ఒకటి రెండు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నా అవి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సులు కావడంతో ప్రయాణికులతో ఉంటుంది.

ఆ బస్సులో పది మంది వరకు విద్యార్థులు అతి కష్టం మీద ఫుట్ బోర్డు ప్రయాణం చేస్తూ కరీంనగర్ చేరుకుంటుండగా, మిగతా వారు గంటల తరబడి బస్టాండ్‌లోనే నిరీక్షిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 9 తరువాత వచ్చే బస్సుల్లో విద్యార్థులు కాలేజీలకు చేరుకునే సరికి 10.30 అవు తుందని, దీంతో కళాశాల సిబ్బంది అనుమతించ డం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు, వివిధ పనులపై కరీంనగర్ వెళ్లె ప్రయాణికులతో ధర్మారం బస్టాండ్ ఉదయం రద్దీగా ఉంటుంది. కాలేజీ, ఆఫీసు సమయాల్లో ధర్మారం నుంచి కరీంనగర్‌కు ప్రత్యేక బస్సులు నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రెండు గంటలుగా ఎదురుచూపులు
చల్లూరి మహిత. (విద్యార్థిని, పాతగూడూర్)

ఎండపల్లి మండలం పాతగూడూర్ గ్రామం. శ్రీచైతన్య కాలేజీలో బీటెక్ చేస్తున్నా. మా ఊరి నుంచి 7 గంటల వరకే బస్టాండ్‌కు వచ్చాను. బస్సు కోసం రెండు గంటలు ఎదురుచూడాల్సి వస్తోంది. ఎక్స్‌ప్రెస్ వచ్చిరా అందులో జాగలేక ఎక్కలేదు. ఒక్క బస్సులో 110 మంది ప్రయాణిస్తున్నారు. ధర్మారం నుంచి కరీంనగర్‌కు ప్రత్యేక బస్సులు నడిపించాలి.



కళాశాలకు అనుమతించడం లేదు
అట్ల సమత (విద్యార్థిని, చామనపల్లి)

ధర్మారం మండలంలోని చామనపల్లి గ్రామం. మా ఊరు నుంచి బస్సులో ధర్మారం వచ్చాను. బస్టాండ్‌లో కరీంనగర్‌కు బస్సులు ఉండడం లేదు. 9.20 కి బస్సు వస్తుంది. బస్సులో బాగా రద్దీగా ఉండి నిలబడాల్సి వస్తోంది. కళాశాలకు వెళ్లే వరకు 10.30 అవుతుంది. దీంతో కళాశాల యాజమాన్యం లోపలికి అనుమతించడం లేదు. మధ్యాహ్నం లంచ్ టైం వరకు బయటే ఉండాల్సి వస్తోంది. ఉదయం వేళలో బస్సుల సంఖ్య పెంచాలి.



గోదావరిఖనిలో రౌడీషీటర్లపై హత్యాయత్నం


గాయపడిన చీమల తిరుపతి

కోల్‌సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రశాంత్‌నగర్‌లో శుక్రవారం చీమల తిరుపతి(38) అనే రౌడీషీటర్‌పై హత్యాయత్నం జరిగింది. బోనగిరి రాకేష్ అలియాస్ రాజేంద్రకుమార్, రాగుల రాజశేఖర్‌లు పాతగొడవలను మనసులో పెట్టుకుని తల్వార్, కత్తితో దాడి చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు. తీవ్రంగా గాయపడిన తిరుపతిని గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. అతనిపరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. చీమల తిరుపతి, రాకేష్, రాజశేఖర్‌లు 2021లో జరిగిన సీపీఎంకార్యకర్త బందారి మొగిలి హత్య కేసులో నిందితులు. అదే కాలనీకిచెందిన మొగిలిని భూ వివాదంలో హత్య చేసినట్టు కేసు నమోదు అయ్యింది. ఈ కేసులో చీమల తిరుపతి ప్రధాననిందితుడిగా ఉన్నాడు. ప్రస్తుతం ఈ కేసు ట్రయల్‌కు వచ్చింది. రాజశేఖర్, రాకేష్‌లు ఈకేసును రాజీ చేసుకుందామని చీమల తిరుపతిపై ఒత్తిడి పెడుతున్నట్టు తెలుస్తుంది. అతడు కేసు రాజీకి ఆసక్తి కనబర్చకపోవడంతో వీరి మధ్య విబేదాలు తలెత్తినట్టు పోలీసులు పేర్కొంటున్నారు. శుక్రవారం ప్రశాంత్ నగర్‌లో తిరుపతి వెనుక వెళ్లిన రాకేష్, రాజేష్‌లు అతనితో ఘర్షణ పడి పక్కనే ఉన్న ఒకఆన్‌లైన్ సెంటర్‌లోకి లాక్కు వెళ్లి తల, చేతిపై కత్తులతో దాడి చేశారని పోలీసులు తెలిపారు. బాధితుడి భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

ఓదెల, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడక నుంచి కనగర్తి వెళ్లే రోడ్డుమూలమలుపు వద్ద గురువారం రాత్రి లారీబోల్తాపడి డ్రైవర్‌కు గాయాలయ్యాయి. సుల్తానాబాద్, సుద్దాల ఇటుక బట్టీల నుంచి లారీ ఓదెల మండలం కనగర్తి మీదుగా పొత్కపల్లి వైపు వస్తుండగా మడక మూలమలుపు వద్ద బోల్తా పడింది. ప్రమాదంలో భూపాలపల్లి జిల్లా కొయ్యూరుకుచెందిన డ్రైవర్, ఓనర్ కుంభం మహేష్ తలకు గాయాలయ్యాయి. ప్రస్తుతం కొయ్యూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేస్తున్నారు. నల్ల మట్టిని రవాణా చేసి ఇటుక బట్టీల వద్ద అన్‌లోడ్ చేసిన తర్వాత, అక్కడి నుంచి మళ్లీ మట్టిలోడు కోసం వేగంగా వస్తుండగా ప్రమాదం చోటుచేసుకొంది. మూడేండ్ల క్రితం ఇదే మూల మలుపు వద్ద ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి చెందాడు. ప్రమాదకరంగా ఉన్న ఈ మూలమలుపు వద్ద హెచ్చరిక బోర్డు లేదా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యం చోరీ

పెద్దపల్లి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పన్నపేటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం చోరీ అయ్యాయని రైతు పెర్క రాజు పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం ధాన్యాన్ని కేంద్రంలో ఆరబోయగా గురువారం రాత్రి గుర్తు తెలియన దుండగులు సుమారు 4 బస్తాల వరకు ధాన్యం ఎత్తుకెళ్లారని రైతు రాజు ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు కాని ధాన్యానికి ఎలాంటి రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు. పరిహారం చెల్లించి ఇలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని రైతు కోరుతున్నారు.

మొబైల్ ఫోన్ పోతే ఫిర్యాదు చేయండి

● జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్



బాధితురాలికి ఫోన్‌ను అందజేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ పోయినా, చోరీకి గురైనా పోలీసులకు ఫిర్యాదు చేయాలని, జిల్లా పోలీసులు సూచించిన సీఈఐఆర్ అప్లికేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు పోగొట్టుకున్న రూ.20లక్షల విలువైన 102సెల్‌ఫోన్‌లను ఎస్పీ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫోన్‌లు పోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెంటనే ఫిర్యాదు చేస్తే ఫోన్‌లను స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. మొబైల్‌ఫోన్ పోయినా, చోరీకి గురైనా వెంటనే పట్టుకోవడానికి సీఈఐఆర్ వెబ్‌సైట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 986 ఫోన్‌లు రికవరీ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా మొబైల్ ఫోన్‌ల రికవరీలో ప్రతిభ కనబరచిన ఇన్‌స్పెక్టర్ రఫీక్, ఆర్‌ఎస్‌ఐ కృష్ణ తదితరులను ఎస్పీ అభినందించారు.

అదుపుతప్పిన కారు.. ఒకరికి స్వల్పగాయాలు

వేములవాడ, మే 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మొదటి బైపాస్ రహదారిలో గల మహాలక్ష్మివీధి ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున మారుతి బ్రీజా కారు అదుపుతప్పి చెట్టునుఢీకొంది. వేగంగా దూసుకువచ్చి చెట్టును ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న ఒకరికి స్వల్పగాయాలు కాగా ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

గాలికి ఎగిరిపోయిన రేకుల షెడ్డు

శంకరపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్‌లో గురువారం అర్ధరాత్రి వీచిన గాలికి పూదరి రవి-రమ దంపతులు ఇంటిముందు వేసుకున్న రేకులషెడ్డు పైపులతోసహా లేచి సమీపంలో ఉన్న టేకుచెట్ల కొమ్మలకు తట్టుకొని ఆగింది గాలి దుమారానికి కొన్ని రేకులు ముక్కలు ముక్కలయ్యాయి. సుమారు రూ.40వేల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ఆస్తినష్టంపై పంచాయతీ కార్యదర్శి ఎలగందుల శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

కొడిమ్యాలలో వివాహిత హత్య


మమత(ఫైల్)

కొడిమ్యాల, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన అవుదుర్తి మమత(35) హత్యకు గురైంది. సంఘటన స్థలాన్ని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ నీలంరవి పరిశీలించారు. కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ శుక్రవారం సాయంత్రం వివరాలు వెల్లడించారు. 20సంవత్సరాల క్రితం కొడిమ్యాలకు చెందిన అవుదుర్తి మహేందర్ గంగాధర మండలం మల్లాపూర్‌గ్రామానికి మమతకు వివాహం జరిగింది. సంవత్సరం నుంచి భర్త మహేందర్, అత్తమామలు వజ్రవ్వ, లక్ష్మణ్, మరుదులు అనిల్, వెంకటేష్ ఆస్తితగాదా విషయంలో మమతను కట్నం తీసుకరాలేదని, సంతానం లేదని మానసికంగా వేధిస్తున్నారు. ఆస్తి తగాదాల విషయంలో తన తల్లిగారింటివద్ద ఉంటున్న మమతను గతనెల 26న మహేందర్ కొడిమ్యాలకు తీసుకువచ్చి హత్యచేశాడు. అనంతరం 28న కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో తనభార్య కనబడడంలేదని ఫిర్యాదుచేశాడు. మహేందర్‌ను మమత తల్లిదండ్రులు నిలదీయగా మాట దాటవేసాడు. అనుమానంతో శుక్రవారం కొడిమ్యాలలో తాళం వేసిన ఇంటిని తనిఖీచేసి చూడగా మమత మృతదేహం కనిపించింది. అల్లుడు మహేందర్ తన కూతురు మమతను హత్య చేశాడని మృతురాలి తల్లి రాచకొండ పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తునట్లు ఎస్సై వివరించారు.

కోనరావుపేటలో చిరుత సంచారం

కోనరావుపేట, మే 2 (అంధ్రజోతి): కోనరావుపేట మండలంలోని వెంకట్రావుపేట గుట్ట ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నదని ఫారెస్ట్‌సెక్షన్ ఆఫీసర్ పల్లె శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం వెంకట్రావుపేట బస్టాండ్ ప్రాంతం సమీపంలోని పల్లెప్రకృతి వనంను ఆనుకుని ఉన్న గద్దగుట్ట నుంచి చిరుత పొలాల వైపు వెళ్లిందన్నారు. కొండాపూర్ గ్రామానికి చెందిన దండురవి ట్రాక్టర్ నడుపుకుంటూ వెళుతుండగా శుక్రవారం రాత్రి 7గంటలకు చిరుత రోడ్డు దాటుతుండాన్ని గమనించాడన్నారు. ఈ విషయం తెలుసుకుని అధికారులు కే సుదర్శన్, బీ అభిషేక్‌రావుతో కలిసి తాను ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామని తెలిపారు. వెంకట్రావుపేట గుట్ట నుంచి కిందికి దిగి పొలాల వైపు వెళ్లినట్లుగా చిరుత అడుగులను గుర్తించామన్నారు. అటవీప్రాంత రైతులు తమ పశువులను ఇంటి వద్దనే కట్టేసి ఉంచుకోవాలన్నారు. రైతులు రాత్రిపూట పొలాల వద్దకు వెళ్లవద్దని సూచించారు. కోనరావుపేటలో చిరుత సంచారంతో ప్రజలు భయందోళనకు గురవుతున్నారు.

రెండు లారీలు ఢీ


ఢీకొన్న రెండు లారీలు

జమ్మికుంట, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప దేవాలయం సమీపంలో శుక్రవారం యూటర్న్ తీసుకుంటున్న ఓ లారీని ఎదురుగా వస్తున్న మరో లారీ ఢీ కొట్టింది. జమ్మికుంట నుంచి గజ్వేల్ వెళ్తున్న లారీ అయ్యప్పస్వామి దేవాలయం ఎదురుగా ఉన్న వేబ్రిడ్జివైపు వెళ్లేందుకు డ్రైవర్ యూటర్న్ తీసుకున్నాడు. అదేసమయంలో హుజూరాబాద్ నుంచి జమ్మికుంట వైపు వస్తున్న మరో లారీ వేగం ఒక్కసారిగా కంట్రోల్ కాకపోవడంతో ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో రెండు లారీలు ధ్వంసం అయ్యాయి. ఇద్దరు డ్రైవర్లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టారు.

పోలీస్ స్టేషన్ ఎదుట
మృతుడి బంధువుల ఆందోళన


ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు, గ్రామస్థులు

జగిత్యాలరూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన పడిగెల మల్లారెడ్డి భూవివాదం నేపథ్యంలో గురువారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకోగా శుక్రవారం మృతుడి బంధువులు, గ్రామస్థులు జగిత్యాలరూరల్ పోలీస్ స్టేషన్‌ఎదుట ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా మృతుడిబంధువులు మాట్లాడుతూ మృతుడు మల్లారెడ్డికి సంబంధించిన భూమిని ఆక్రమించడంతోపాటు పడిగెల గంగారెడ్డి, పడిగెల రాజిరెడ్డి, పడిగెల జనార్దన్ అనేవ్యక్తులు మల్లారెడ్డిని చంపుతానని బెదిరించడంతోనే మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి కూతురు శరణ్య ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ పోలీస్‌స్టేషన్ చుట్టూ మూడునెలల నుంచి తిరిగినా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. మృతుడిచావుకు బాధ్యులైన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్‌చేశారు. ఈ విషయమై జగిత్యాలరూరల్ సీఐ కృష్ణారెడ్డిని వివరణ కోరగా పడిగెల గంగారెడ్డికి మృతుడు మల్లారెడ్డికి 30 సంవత్సరాలుగా భూవివాదం జరుగుతుందన్నారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు మోఖమీదికి వెళ్లి విచారణ చేపట్టామని, భూవివాదం కాబట్టి రెవెన్యూలో గాని, కోర్టు పరిధిలో తేల్చుకోవాలని వారికి సూచించామన్నారు. మృతుడు మల్లారెడ్డిని బెదిరించినట్లు తమకు ఫిర్యాదు అందలేదని అన్నారు. మరింత లోతుగా విచారణ చేపట్టి బాధ్యులపై తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని హనుమాన్ దీక్షాపరుడి మృతి

జగిత్యాల అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నటరాజ్ చౌరస్తాలో శుక్రవారం ఆర్టీసీబస్సు ఢీకొని జగిత్యాల మండలం టీఆర్‌నగర్‌కు చెందిన కృష్ణమూర్తి (53) అనే హనుమాన్ దీక్షాపరుడు మృతిచెందాడు. నిజామాబాద్ వైపు నుంచి జగిత్యాలకు వస్తున్న ఆర్టీసీ బస్సు నటరాజ్ చౌరస్తా వద్ద కృష్ణమూర్తి రోడ్డుదాటుతున్న సమ యంలో ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

● **ఎమ్మెల్యే పరామర్శ..**

కృష్ణమూర్తికుటుంబసభ్యులను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించారు. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే ఆయన ఆసుపత్రికి వెళ్లి కృష్ణమూర్తి భౌతిక కాయాన్ని పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి కృష్ణమూర్తితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్ చాంద్ ఉన్నారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్



వివరాలు వెల్లడిస్తున్న పెద్దపల్లి డీసీపీ ఫుల్లా కరుణాకర్

బసంత్‌నగర్‌లో బైక్ దొంగల అరెస్టు

పాలకుర్తి, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బసంత్‌నగర్ పోలీసులు శుక్రవారం బైక్ దొంగలను అరెస్టుచేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ ఫుల్లా కరుణాకర్ మాట్లాడుతూ నిందితుల నుంచి రూ.5లక్షల విలువగల ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆరుగురు సభ్యులు ముఠాగా ఏర్పడి వాహనాలను దొంగిలిస్తున్నారన్నారు. ఇద్దరినీ అరెస్టు చేశామని, ముగ్గురు మైనర్లు ఉండగా ఒక్కరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఏసీపీ గజ్జి కృష్ణ, ఎస్‌ఐ ఆర్ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం బసంత్‌నగర్ ఎస్‌ఐ స్వామి ఆధ్వర్యంలో సిబ్బంది కొత్తపల్లె బస్టాప్ వద్ద ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు.

దోస్త్ నోటిఫికేషన్ విడుదల

గణేశ్‌నగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో 2025 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి దోస్త్2025 నోటిఫికేషన్‌ను ఉన్నత విద్యామండలి శుక్రవారం విడుదల చేసింది. ఈ నెల 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రూ.200 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ నెల 10 నుంచి 22వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. మే 29న ఫస్ట్ ఫేస్ సీట్ల అలాట్‌మెంట్ ఉంటుంది. ఫస్ట్ ఫేస్‌లో సీట్లు పొందిన విద్యార్థులు మే30 నుంచి జూన్ 6వ తేదీలోపు ఆయా కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. సెకండ్ ఫేస్ దరఖాస్తుల ప్రక్రియ మే 30 నుంచి జూన్ 8 వరకు కొనసాగనుంది. సెకండ్ ఫేస్‌లో కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే వారు రూ.400 చెల్లించాలి. మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. జూన్ 13న రెండో దశ సీట్లు కేటాయించనున్నారు. జూన్ 13 నుంచి 18వ తేదీ లోపు ఆయా కళాశాల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. థర్డ్ ఫేస్ దరఖాస్తుల ప్రక్రియ జూన్ 13 నుంచి 19వ తేదీ వరకు కొనసాగనుంది. రిజిస్ట్రేషన్‌కు రూ.400 చెల్లించాలి. జూన్ 13 నుంచి 19 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. జూన్ 23న సీట్ల కేటాయింపు ఉంటుంది. జూన్ 23 నుంచి 28 వరకు కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్టింగ్‌కు అవకాశం కల్పించారు. జూన్ 30 నుంచి డిగ్రీ ఫస్టియర్ తరగతులు ప్రారంభం కానున్నాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలు

- 7 నుంచి జూన్ 6 వరకు
- 13 నుంచి 23 సంవత్సరాల బాలబాలికలు అర్హులు
- కరీంనగర్, జగిత్యాల, వేములవాడ, గోదావరిఖనిలో ఏర్పాటు



వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న క్రికెట్ సంఘం సభ్యులు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఆగంరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని క్రికెట్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్‌లో రెండు, వేములవాడ, జగిత్యాల, గోదావరిఖనిలో ఒక్కోటి చొప్పున మొత్తం ఐదు శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ నెల 7 నుంచి జూన్ 6 వరకు శిబిరాలను కొనసాగుతాయన్నారు. 13 నుంచి 23 సంవత్సరాల్లోపు వయస్సుగల బాలబాలికలు, యువత అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 6వ తేదీలోగా జిల్లా క్రికెట్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శిబిరాల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులతో ఈ నెల 12 నుంచి ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలను నిర్వహిస్తామని అందులో రాణించే క్రీడాకారులను వచ్చే నెలలో హెచ్‌సీఏ లీగ్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శిబిరాల్లో శిక్షణ ఉంటుందన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, ఉపాధ్యక్షులు మహేందర్‌గౌడ్, మనోహర్‌రావు, కోశాధికారి శ్రావణ్, సంయుక్త కార్యదర్శి కరుణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌యూ అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా శ్రీవాణి



నియామక పత్రాలు అందజేస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం అదనపు పరీక్షల నియంత్రణ (కాన్ఫిడెన్షియల్) అధికారిగా అర్థశాస్త్ర విభాగపు అధిపతి డాక్టర్ కె.శ్రీవాణి నియామకమయ్యారు. శుక్రవారం రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వీసీ ఉమేష్‌కుమార్‌కు, రిజిస్ట్రార్ రవికుమార్‌కు, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్‌కుమార్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. ఇంగ్లీష్, తెలుగు, ఎంకాం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, బాటనీ, జంతు శాస్త్రం ఇలా మొత్తం కోర్సుల్లో 79 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ మనోజ్ కుమార్, సహాయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రజనీ దేవి, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న పరీక్షల నియంత్రణ అధికారి శ్రీనివాస్ రెడ్డి

నిజాం షుగర్స్ పునరుద్ధరణపై సందిగ్ధం

- ఫ్యాక్టరీలు తెరిపించడంపై స్పష్టత కరువు
- తేలని నిర్వహణ.. ప్రభుత్వమా..ప్రైవేటా.. సహకార పద్ధతిలోనా?
- నిజామ్ షుగర్స్ పునర్‌వైభవానికి అన్నదాతల ఎదురుచూపులు

జగిత్యాల, మే 2 (ఆంధ్రజ్యోతి): నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్‌ఎల్) పునరుద్ధరణపై సందిగ్ధం నెలకొంది. రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఎన్‌డీఎస్‌ఎల్ యూనిట్లను పునరుద్ధరించడానికి సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు అడుగులు వేసిన ప్పటికీ సరైన స్పష్టత రావడం లేదు. జగిత్యాల జిల్లా ముత్యంపేట చక్కర కర్మాగారంతో పాటు నిజామాబాద్ జిల్లా బోధన్, మెదక్ జిల్లా ముంబోజుపల్లి కర్మాగారాలను తెరిపించడానికి గత యేడాది జనవరి నెలలో ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ కొంత ప్రక్రియ పూర్తి చేసింది. ఉమ్మడి యాజమాన్యం పరిధిలోని ఈ ఫ్యాక్టరీలకు చెందిన రూ. 400 కోట్ల బ్యాంకుల బకాయిలకు సంబంధించి వన్ టైం సెటిల్‌మెంట్ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ. 190 కోట్లు చెల్లించింది. నిజాం షుగర్స్‌ను పునరుద్ధరించినప్పటికీ తాము నడపలేమని భాగస్వామ్య సంస్థ అయిన డెల్టా పేపర్స్ లిమెటెడ్ గతంలోనే ప్రభుత్వానికి స్పష్టం చేసింది.

సంస్థలో 51 శాతం వాటాను కలిగియున్న డెల్టాకు స్వస్తి పలకాలంటే ఆస్తుల విలువ, సాంకేతిక స్థితిగతులు, న్యాయపరమైన చిక్కులు తదితర అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది. 2025 డిసెంబరు నాటికి ఫ్యాక్టరీని తెరిపిస్తామని ప్రకటించినప్పటికీ.. అది మరింత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఈ యేడాది క్రషింగ్ సీజన్ (అక్టోబరు నుంచి డిసెంబరు) నాటికి కర్మాగారం పరిధిలో రైతులు గణనీయమైన విస్తీర్ణంలో చెరుకు పంట పండించేందుకు ముందుకు రావాల్సి ఉంది. ఇప్పటి నుంచి వానాకాలం వరకు చెరుకు నాటేందుకు అనువైన సమయం ఉంటుందని రైతులు అంటున్నారు.

తొమ్మిదన్నరేళ్లుగా లే ఆఫ్‌లో..

నిజామాబాద్ జిల్లా బోధన్ కేంద్రంగా 1938 సంవత్సరంలో నిజాం సర్కారు నిజాం చక్కర కర్మాగారం ప్రారంభించింది. దీనికి అనుబంధంగా జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేట, మెదక్ జిల్లా ముంబోజుపల్లిలో పరిశ్రమలను స్థాపించింది. గత పాలకుల విధానాలు, పరిశ్రమ నష్టాల బాట పట్టిందన్న కారణంతో 2002 సంవత్సరం ప్రైవేటీకరణ చేశారు. ఈ మూడు యూనిట్లు 51శాతం డెల్టా కంపెనీ, 49 శాతం ప్రభుత్వ వాటాలను కలిగి ఉన్నాయి. అయినా నష్టాల నుంచి బయట పడకపోవడంతో 2015 డిసెంబరు 23వ తేదీన లేఆఫ్‌గా ప్రకటించి బోధన్, ముత్యంపేట, ముంబోజుపల్లి కర్మాగారాలను యాజమాన్యం మూసివేసింది.

అనంతరం బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో కర్మాగారాలను తెరిపిస్తామని హామీనిచ్చినప్పటికీ అమలుకు నోచుకోలేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ కర్మాగారాల పునరుద్ధరణపై కసరత్తులు చేస్తోంది. రాష్ట్ర మంత్రి శ్రీదర్‌బాబు చైర్మన్‌గా ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైస్ చైర్మన్‌గా సభ్యులుగా జగిత్యాలకు చెందిన మాజీ ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్, పలు విభాగాలకు చెందిన రాష్ట్రస్థాయి అధికారులను నియమించింది. కమిటీ ఇప్పటికే కర్మాగారాలను సందర్శించి ప్రభుత్వానికి సమాచారం అందించింది.

తేలని డెల్టా వాటా వ్యవహారం..

నిజాం షుగర్స్‌పై అధ్యయనం చేసి ఆస్తుల విలువను లెక్కించి అవసరమైన సలహాలు, సూచనలతో నివేదికను సమర్పించడానికి క్యాపిటల్ ఫార్చ్యూన్స్ అనే సంస్థను కన్సల్‌టెంట్‌గా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించింది. సాధ్యమైనంత తొందరలో కన్సల్‌టెంట్ కంపెనీ అధ్యయనం చేసి నివేదిక అందజేయాలని ఆదేశించింది. ప్రస్తుతం కర్మాగారాల్లోని యంత్రాలు వినియోగించే స్థితిలో ఉన్నాయా...మరమ్మతులతో నడిపించుకునే వీలు ఉంటుందా..లేదంటే కొత్తవి కొనుగోలు చేయాలా అన్న వివరాలు సేకరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్‌డీఎస్‌ఎల్ తరపున సమాచారం ఇచ్చేందుకు సంస్థలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఓ డిప్యూటీ డైరెక్టర్‌ను సమన్వయ అధికారిగా ప్రభుత్వం నియమించినట్లు ప్రచారం జరుగుతోంది. కన్సల్‌టెంట్ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవడానికి యోచిస్తున్నారు. డెల్టా వాటాను తిరిగి అప్పగించి స్వస్తి పలకాలంటే ఏమి చేయాలన్న అంశం తేలడం లేదు.

నిర్వహణపై రాని స్పష్టత...

ఎన్‌డీఎస్‌ఎల్‌లో భాగస్వామిగా ఉన్న డెల్టా కంపెనీకి స్వస్తి పలికి ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకోవాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కర్మాగారాలను ఎలా నిర్వహించాలన్న అంశంపై కమిటీ సభ్యులతో పాటు ప్రభుత్వ పెద్దలు పలు విధాలుగా సూచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహణ ఉండాలా.. ప్రైవేటు కంపెనీకి బాధ్యతలు అప్పగించాలా.. సహకార పద్ధతిలో నిర్వహించాలా అన్న అంశంపై ఇంకా స్పష్టత రావడం లేదు. సహకార పద్ధతిలో నడిచే షుగర్ ఫ్యాక్టరీల ప్రోత్సాహకానికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేయడంతో నిధులు రావాలంటే సహకార విధానం అనుసరించాలా అన్న చర్చలు జరుగుతున్నట్లు సమాచారం.

ప్రస్తుత యేడాది డిసెంబరు నాటికి కర్మాగారాలను పునరుద్ధరణ జరుగుతుందని కమిటీ వర్గాలు అంటున్నాయి. ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన అంశాలపై స్పష్టత రావడం లేదు. ముఖ్యమంత్రి స్థాయిలో నిర్ణయాలు జరిగితేగాని పునరుద్ధరణ ముందుకు పడే అవకాశాలు లేవన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కర్మాగార పునరుద్ధరణపై అన్నదాతలు ఆశతో ఎదురు చూస్తున్నారు.



జగిత్యాల జిల్లా ముత్యంపేట చక్కర కర్మాగారం

వేములవాడలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మే 2(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శుక్రవారం తెల్లవారు జామును నుంచి రాజన్న దర్శనం కోసం భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదేశాలతో ఏఈవోలు శ్రావన్ కుమార్, అశోక్‌కుమార్‌లు సూపరింటెండెంట్‌లు వరి నర్సయ్య, ఇన్‌స్పెక్టర్ రాజేందర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రాజన్న ఆలయ ప్రాంగణంలో భక్తులు

ఘనంగా ఆరుద్ర నక్షత్రోత్సవము..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రోత్సవ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పరివార దేవతార్చనలు సదస్యం గావించారు. కాగా రాజన్న ఆలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న జగద్గురు శంకరాచార్యులు జయంతి శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శుక్రవారం సదస్యము వసంతమాధవ పూజ కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు.

రాజన్న సేవలో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌లు..

రాజరాజేశ్వర స్వామివారిని డిప్యూటీ కమిషనర్‌లు కృష్ణప్రసాద్, టంకశాల వెంకటేష్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌లు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయానికి వీచ్చేసిన వారికి అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజ అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఏఈవో శ్రావణ్ కుమార్ రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. వెంట నును గొండ రాజేందర్, ఎడ్ల శివసాయి, పురాణం వంశీమోహన్, గొట్టం గిరిబాబు తదితరులు ఉన్నారు. కాగా, వేములవాడ రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో పంప్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తించిన కూరగాయల శంకర్ పదవీ విరమణ చేశారు. ఆలయ ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో శంకర్ దంపతులను ఘనంగా సన్మానించారు.

ప్రారంభమైన ఎప్‌సెట్ ఇంజనీరింగ్ పరీక్షలు

- కరీంనగర్ జోన్ పరిధిలో 12కేంద్రాలు
- 5,628మంది అభ్యర్థులకు 5,356మంది హాజరు

తిమ్మాపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎప్‌సెట్-2025 అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో పరీక్షలు ఏప్రిల్ 29, 30తేదీల్లో జరగగా, మే 2నుంచి 4వరకు ఇంజనీరింగ్ విభాగంలో పరీక్షలు జరుగనున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం ఇంజనీరింగ్ విభాగంలో జరిగిన ఎప్‌సెట్ పరీక్షలకు కరీంనగర్‌జోన్ పరిధిలో కరీంనగర్, హుజూరాబాద్, మంథని, జగిత్యాల, సిద్దిపేటలో మొత్తం కలిపి 12 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

5,628మంది అభ్యర్థులకు 5,356మంది హాజరు..



పరీక్ష కేంద్రంలో అభ్యర్థుల పత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు సెషన్‌లలో పరీక్షను నిర్వహించారు. ఉదయం 7.30నుంచి, మధ్యాహ్నం 1.30 నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి అంటే పరీక్ష సమయానికి 90 నిమిషాల ముందునుంచే అభ్యర్థులను పరీక్షకేంద్రాల్లోకి అనుమతించారు. కరీంనగర్ జోన్ పరిధిలోని 12కేంద్రాల్లో కలిపి మొదటి సెషన్‌లో 2,813మంది విద్యార్థులకుగాను 2,672మంది(95%) అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా 141 మంది హాజరు కాలేదు. రెండో సెషన్‌లో 2,815మంది విద్యార్థులకుగాను 2,684మంది (95.3%)హాజరు కాగా 131మంది గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు

- ట్రాక్టర్, కారు ఉంటే అనర్హత
- నిబంధనలు కఠినతరం

చొప్పదండి, మే 2 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలకు చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలను రూపొందించింది. పక్కాగా పేదలకు ఇళ్లు దక్కేలా పకడ్బందీగా సర్వే చేస్తుండగా, నిబంధనలు కఠినతరంగా ఉండడంతో అనేక మందికి ఇళ్లు దక్కే అవకాశం లేదు. కారు, ఏసీ, ట్రాక్టర్‌తో పాటు చాలా నిబంధనలు రూపొందించగా, వడపోతలో లబ్ధిదారులు ఇళ్లకు అర్హత కోల్పోతున్నారు. ప్రస్తుతం చొప్పదండి పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారుల సర్వేకు ప్రత్యేక అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలను అందించింది.



నిబంధనలు ఇవే...

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు బీపీఎల్ (దారిద్ర్య రేఖకు దిగువ) కుటుంబానికి చెందిన వారై ఉండాలి. గ్రామాల్లో నివసించే లబ్ధిదారుడి ఆదాయం నెలకు 10 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాలకు 15 వేలలోపు ఉండాలి.
- రెండున్నర ఎకరాలకు ఎక్కువ భూమి ఉన్న రైతులు అనర్హులు.
- నాలుగు చక్రాల వాహనం, ట్రాక్టర్ ఉన్న రైతులు అనర్హులు.
- లబ్ధిదారుడి కుటుంబంలో కేసీసీ (క్రాప్ లోన్) 50 వేల రూపాయలకు మించి ఉండరాదు.
- వ్యాపారం, అదనపు ఆదాయ పన్ను, ప్రొఫెషనల్ టాక్స్ చెల్లించే లబ్ధిదారులు అనర్హులు.
- లబ్ధిదారుడి కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉంటే అర్హులు కారు.
- దరఖాస్తు చేసుకున్న ప్రాంత నివాసి అయి ఉండాలి.
- సంచార కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయరాదు.
- ప్రస్తుతం రేకుల షెడ్డు, గుడిసె, గునపెంకుల ఇంటిలో నివాసం ఉన్న లబిదారుడు అర్హుడు.
- తండ్రి, ఇద్దరు కుమారులతో నివాసం ఉన్నట్లయితే ఒక్కరికే ఇందిరమ్మ ఇళ్లమంజూరు చేస్తారు.
- మున్సిపల్ ప్రాంతంలో అద్దె ఇంటిలో నివాసం ఉండే లబ్ధిదారులు అర్హులే.
- పట్టణ ప్రాంతాల్లో ఇంటి స్థలం పట్టా సర్టిఫికెట్ ఉండాలి.
- లబ్ధిదారుడికి 60 గజాల ఇంటి స్థలం ఉండాలి.
- ఇంటి స్థలానికి సంబంధించి పట్టా, ఓనర్‌షిప్ సర్టిఫికెట్ లేకుంటే ఇల్లు మంజూరు చేయరాదు.
- కొత్త ఇంటి నిర్మాణం 400 నుంచి 600 అడుగులలోపు ఉండాలి. అధికంగా ఉంటే అనుమతి ఇవ్వరాదు.
- ఇండ్ల నిర్మాణంలో రెండు గదులు, కిచెన్, మరుగుదొడ్డితో నిర్మించాలి.
- ఇంటి నిర్మాణం ఇంతకు ముందే ప్రారంభించిన, పాత ఇంటిని కలుపుకొని నిర్మించిన కొత్త ఇందిరమ్మ ఇంటికి అనర్హులే.

వైభవంగా పార్వతీ కోటేశ్వరస్వామి కల్యాణం

- పట్టు వస్త్రాలు తలంబ్రాలు సమర్పించిన విప్ అడ్లూరి
- ఆది దంపతుల కల్యాణం తిలకించి తరించిన భక్తులు



కోటిలింగాలలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వెల్గటూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటిలింగాలలో పార్వతీ కోటేశ్వరస్వామి ఆలయములో శంకర జయంతి సందర్భంగా పార్వతీ కోటేశ్వరస్వామి వారి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకం, అర్చన అభిషేకాదుల వంటి పూజలు నిర్వహించారు. ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్వామివారలకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. మాజీ పీఏసీఎస్ చైర్మన్ మద్దుల గోపాల్‌రెడ్డి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు స్వామివారి కల్యాణానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం కరీంనగర్‌కు చెందిన అంబటి అనూష- రవీందర్‌రావు దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కాంతారెడ్డి, అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్‌శర్మ, అన్వేష్ శర్మ, తహసీల్దార్ శేఖర్, ఏఎంసీ చైర్మన్ గుండాటి గోపిక జితేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, నాయకులు నక్క రవితేజ, గొల్ల తిరుపతి, మెరుగు మురళి గౌడ్, పూదరి రమేష్, బందెల ఉదయ్‌గౌడ్, శ్రీకాంత్‌రావు పాల్గొన్నారు.

విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక పూజలు

కోటిలింగాల కోటేశ్వరస్వామిని శుక్రవారం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కాంతారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు నాగరాజుశర్మ, సంజీవ్‌శర్మ ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

గంజాయి ముఠా అరెస్ట్

9 కిలోల గంజాయి స్వాధీనం

ఓదెల, మే 2((ఆంధ్రజ్యోతి): మత్తుకు యువకులు, విద్యార్థులు దూరంగా ఉండాలని, గంజాయిని పూర్తిగా తుదముట్టించే వరకు కఠిన చర్యలు కొనసాగుతాయని డీసీపీ పుల్లా కరుణాకర్ అన్నారు. మండలంలోని పొత్కపల్లి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించి గంజాయి నిందితుల వివరాలను వెల్లడించారు. డీసీపీ కరుణాకర్ మాట్లాడుతూ పొత్కపల్లి రైల్వే స్టేషన్ వద్ద విశ్వసనీయ సమాచారం మేరకు పొత్కపల్లి ఎస్‌ఐ రమేష్ బృందం వెళ్లి పరిశీలించారని, అక్కడ అనుమానస్పదంగా తిరుగుతున్న వారిని పట్టుకుని విచారించగా వారి వద్ద రూ.4.8లక్షల విలువ చేసే 9కిలోల 64గ్రాముల ఎండు గంజాయి లభించిందని చెప్పారు. గంజాయితో పాటు నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు డీసీపీ తెలిపారు.

గంజాయి ముఠాకు చెందిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు డీసీపీ తెలిపారు. ఇందులో ప్రధాన నిందితుడు అంతర్గాం మండలం ముర్మూర్‌కు చెందిన జాడి కిరణ్ కాగా, ఇదే గ్రామానికి చెందిన జాడి ప్రకాష్, గోదావరిఖని ద్వారకానగర్‌కు చెందిన గుజ్జుల సాయి, రామగుండం చెందిన కొమురవెల్లి పవన్, అంతర్గాంకు చెందిన ఇండిబిల్లి సందీప్‌కుమార్, ముర్మూర్‌కు చెందిన లింగన్నపేట విష్ణువర్ధన్, అలాగే ఒడిస్సా రాష్ట్రంలోని ఉరుమనూర్ మండలం కలిమేలకు చెందిన కేల కుమార్‌పై కేసు నమోదు చేశామని, ఇందులో కేల కుమార్ పరారీలో ఉన్నట్టు డీసీపీ తెలిపారు. గంజాయి ముఠాను పట్టుకున్న ఎస్‌ఐ రమేష్, ఏఎస్‌ఐ రత్నాకర్, పోలీస్ సిబ్బంది కిషన్, రాజేందర్, సతీష్‌లను అభినందించి నగదు పారితోషికాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ రమేష్ పాల్గొన్నారు.



పొత్కపల్లి పోలీస్ స్టేషన్‌లో నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ కరుణాకర్

సమస్యలు పరిష్కరించాలని ఫీల్డ్‌అసిస్టెంట్ల వినతి

ఇల్లంతకుంట, మే 2 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతు ఫీల్డ్‌అసిసెంట్లు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. నాలుగు నెలల నుంచి వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నామని, ఎన్నికల ముందు ఇచ్చిన హమీ మేరకు ఉద్యోగ భద్రత కల్పించలని కోరారు. ఎమ్మెల్యే స్పందించి కమిషనర్ కార్యాలయానికి ఫోన్‌చేసి సమస్యను వివరించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద రాజు, నాయకులు సత్యనారాయణ, విజయ, చంద్రశేఖర్, కనుకయ్య, మమత, వేణు, తిరుపతి, రమ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ త్వరగా కోలుకోవాలని పూజలు..



ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

గంభీరావుపేట, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు త్వరగా కోలుకోవాలని రావి చెట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం బీఆర్‌ఎస్ నేతలు ప్రత్యేక పూజలు చేశారు. ఇటివల కేటీఆర్ జిమ్ చేస్తుండగా, ప్రమాదవశాత్తు నడుంకు గాయమైందని, ఆ గాయం నుంచి కేటీఆర్ త్వరగా కోలుకుని తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని శ్రీ ఆంజనేయస్వామిని ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నేతలు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల యూత్ ప్రధాన కార్యదర్శి చిట్టంపల్లి బిక్షపతి, మాజీ ఉప సర్పంచ్ సింగారపు నాగరాజుగౌడ్, సీనియర్ నాయకులు కరువారి శంకర్, పాపగారి శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు పిట్ల బాబు తదితరులు ఉన్నారు.

మెరుగైన చికిత్స కోసం ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలో అనారోగ్యంతో బాధ పడుతున్న ఆశా కార్యకర్త లత మెరుగైన చికిత్స కోసం మండల కేంద్రంలోని భీమ్ యువజన సంఘం సభ్యులు శుక్రవారం రూ.12 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆమె కుటుంబ పరిస్థితిని తెలుసుకుని 50 కిలోల బియ్యం వితరణ చేశారు. ప్రభుత్వం వైద్యం అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు జితేందర్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం పదిర, రాజన్నపేట, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్ గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. పేదల వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, వెంకటేశ్, పద్మారెడ్డి, శంకర్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్, నందం, రాజేందర్, సాయి, లత తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులో నిర్వహించనున్న ఉర్సు ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేశ్ బి గితేలను నిర్వాహకుడు అజీజ్, కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఆహ్వాన పత్రాలను అందజేశారు. మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, మల్లేశం, రాంరెడ్డి, గౌస్, తదితరులు ఉన్నారు.

మంత్రి పొన్నంను సన్మానించిన పద్మశాలి సంఘం నాయకులు

సిరిసిల్ల టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్త కులగణకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సిరిసిల్ల పద్మశాలి సంఘం నాయకులు సన్మానించారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను పద్మశాలి సంఘం సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి మండల సత్యం, ఉపాధ్యక్షుడు బాలయ్య కలసి సన్మానించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

సిరిసిల్ల రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు సర్దాపూర్‌లోని జగ్గారావుపల్లె, బాబాజీకాలనీలకు చెందిన చల్ల అనూషకు రూ32వేల 500, మ్యాకల నర్సయ్యకు రూ 17వేల 500 చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి మంజూరైన చెక్కులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధానకార్యదర్శి గంభీరావుపేట ప్రశాంత్‌గౌడ్ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలకిష్టయ్య, యాదయ్య, నర్సయ్య, రాజనర్సు, పర్శయ్య, రాజు, షాదుల్, రాములు, కన్నయ్య, పవన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు డ్రెస్సులు అందజేత



క్రీడాకారులకు డ్రెస్సులను అందజేస్తున్న అరుణ్

కోనరావుపేట, మే 2 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం సుద్దాల క్రికెట్ క్రీడాకారులకు. గ్రామానికి చెందిన ఎర్రవెల్లి అరుణ్ శుక్రవారం డ్రెస్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు కచ్చకాయల మహేష్, జీపీ కార్యదర్శి అభిలాష్, చిట్యాల బాబు, నేరెళ్ల సతీష్, కొరవేణి రమణ, రంజిత్ తదితరులు ఉన్నారు.

టీబీ పరీక్షలు చేయించుకోవాలి

కోనరావుపేట, మే 2 (ఆంధ్రజ్యోతి) : టీబీ లక్షణాలు ఉన్నవారు కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి వేణుమాధవ్ అన్నారు. కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం టీబీ వ్యాధిగ్రస్తుల దగ్గరలో ఉన్న వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దగ్గు, జ్వరము ఎంతకు తగ్గక పోతే వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రషీద్, ల్యాబ్ టెక్నీషియన్ జనార్ధన్, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీకి పరామర్శ

ఇల్లంతకుంట, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్ మాజీ ఎంపీటీసీ గొల్ల మల్లారెడ్డిని జిల్లా రెడ్డి సంఘ అధ్యక్షులు కృష్ణారెడ్డి శుక్రవారం పరామర్శించారు. మల్లారెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పరామర్శించిన వారిలో రెడ్డి సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు కేతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, రమణారెడ్డి, వెంకట్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, రాజిరెడ్డి, రమేష్‌రెడ్డి, పవన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు గంభీరావుపేట బంద్‌కు పిలుపు

గంభీరావుపేట, మే 2 (ఆంధ్రజ్యోతి) : హిందూ ఐక్య వేదిక శనివారం గంభీరావుపేట పట్టణ బంద్‌కు పిలుపునిచ్చింది. పహల్గాం ఉగ్రవాదుల దాడికి నిరసనగా శనివారం పట్టణంలోని వ్యాపారస్థులు బంద్‌కు సహకరించాలని హిందూ ఐక్య వేదిక కోరింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరగబోయే ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని సంఘీభావాన్ని ప్రకటించాలని కోరింది. ఉగ్రవాదుల దాడిలో అమరులైన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఈ బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపింది. మండల కేంద్రంలోని వ్యాపారస్థులు అందరూ బంద్‌ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేసింది.

నీట్, ఐఐటీ లక్ష్యంగా చదవాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన



మండెపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్



బండలింగంపల్లి విద్యార్థులతో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



మూడపల్లిలో సన్మానం పొందిన విద్యార్థులు

సిరిసిల్ల కలెక్టరేట్, మే 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నీట్, ఐఐటీ లక్ష్యంగా చదువుకొని రాణించాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా కోరారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభకనబర్చడంతో శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం విఠల్, ఉపాధ్యాయులు అర్ రమేష్, మహ్మద్ హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శుక్రవారం అభినందించారని పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం తిరుపతి పేర్కొన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారని తెలిపారు. మండలంలోని రాజన్నపేట గ్రామంలో ఇంటర్, పదో తరగతి ఫలితాల్లో అధిక మార్కులు పొందిన విద్యార్థులను తాజా, మాజీ సర్పంచ్ శంకర్ సన్మానించారు. అలాగే రాచర్లబొప్పాపూర్‌లోని సుస్వర అనే విద్యార్థిని బాల్యమిత్ర ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు.



విలాసాగర్‌లో విద్యార్థులను సన్మానిస్తున్న గ్రామస్థులు

● చందుర్తి : చందుర్తి మూడపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాలు సాధించిన విద్యార్థులను గ్రామస్థులు శుక్రవారం సన్మానించారు. విద్యార్థులతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేశంను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిలుక అంజిబాబు, నాయకులు నీరటి ప్రసాద్ మాలమహానాడు జిల్లా కన్వీనర్ నీరటి శ్రీనివాస్, పాల్గొన్నారు.

● బోయినపల్లి : పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన మండలంలోని విలాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను గ్రామస్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం సన్మానించి జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బొలగం శ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శి మిడిదొడ్డి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఏనుగుల కనకయ్య, సుంకపాక చక్రవర్తి, వెంకట్‌తోపాటు ఉపాధ్యాయులు రాజిరెడ్డి, వెంకట హనుమాన్, మధుసూదన్, మోహన కృష్ణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తాం



నాగారంలో రైతులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, మే 2 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లాలో రైతులు గత బీఆర్‌ఎస్ పాలనలో ధాన్యం కొనుగోలు, ప్రజా పాలనలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు మధ్య తేడాను గమనించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కోనరావుపేట మండలంలోని నాగారం గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేగవంతంగా వడ్ల కొనుగోలు జరుగుతుందని, రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎవరు కూడా ఆందోళన చెందవద్దని అన్నారు. రైతు సోదరులు వడ్ల కొనుగోలులో గత బీఆర్‌ఎస్ పాలనకు, కాంగ్రెస్ ప్రజా పాలనకు తేడా గమనించాలని కోరారు. సిరిసిల్ల జిల్లాలో యాసంగి మార్కెటింగ్ సీజన్ మే 1 నాటికి 2021-22లో 175 కొనుగోలు కేంద్రాల ద్వారా 233 మెట్రిక్ టన్నులు, 2022-23లో 229 కొనుగోలు కేంద్రాల ద్వారా 9 వేల 424 మెట్రిక్ టన్నులను గత ప్రభుత్వం కొనుగోలు చేస్తే, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2023-24లో 220 కొనుగోలు కేంద్రాల ద్వారా 67 వేల 520 మెట్రిక్ టన్నులను, ప్రస్తుత సంవత్సరం 244 కొనుగోలు కేంద్రాల ద్వారా 72 వేల 484 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశామని అన్నారు. మే 1 నాటికి గత ప్రభుత్వం కంటే ఎన్నో రెట్లు అధికంగా ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా కొనుగోలు చేసిన ధాన్యంలో రైతులకు వడ్ల డబ్బులు సకాలంలో చెల్లిస్తున్నామని తెలిపారు. భారత ఆహార సంస్థ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకుని వస్తే వెంటనే కొనుగోలు చేస్తున్నామని, నాణ్యత ప్రమాణాలను పరీక్షించి ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలుపై రాజకీయాల కోసం రైతులను అనవసర ఆందోళనలకు గురి చేయవద్దని, ప్రభుత్వం చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎవరు కూడా రాజకీయాల ఆకాంక్షల కోసం తప్పుడు ప్రచారాలు చేసే వారి మాటలు నమ్మవద్దని, ప్రతి రైతు వద్ద నుంచి ధాన్యం సేకరించి మద్దతు ధరను ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు.

రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వం తాలు తప్ప పేరుతో రైతులను నిలువునా మోసం చేసిందన్నారు. సంచికి 44 కిలోలు తూకం వేశారని కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, డైరెక్టర్లు అప్పాల నాగభూషణం, కాంగ్రెస్ నాయకులు భాస్కర్ రావు, మండల అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా తదితరులు ఉన్నారు.

స్థానిక అవసరాలకు ఇసుక అనుమతి ఇవ్వాలి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తంగళ్లపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక అవసరాల కోసం తంగళ్లపల్లి మానేరు నది నుండి గతంలో మాదిరిగా ఇసుక సరఫరాకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు తహసీల్దార్ కార్యాలయంఎదుట నిరసన వ్యక్తం చేసి అనంతరం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ తంగళ్లపల్లి మండలంలోని అన్ని గ్రామాలకు స్థానిక అవసరాల కోసం గతంలో మాదిరిగా తంగళ్ళపల్లి నుంచి యథావిధిగా ఇసుకను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గత కొంతకాలంగా మండలంలోని గ్రామాలకు ఇసుక సరఫరా లేక నిర్మాణాలను నిలిచిపోయాయన్నారు. ఇసుక సరఫరా లేకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిరిసిల్ల నుంచి ఇసుక సరఫరా చేయడంతో ఒక్క ఇసుక ట్రిప్పుకు రూ.3వేల నుంచి రూ.4వేల వరకు చెల్లించాల్సి వస్తుందని, సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని, గతంలో బీఆర్‌ఎస్ హయాంలో మానేరు నది నుంచి ఇసుకను సరఫరా చేసినప్పుడు, ట్రిప్పునకు డీడీ కేవలం రూ.180 ఉండేదని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో డీడీ చార్జీలు రూ.480 పెంచి సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. డీడీ చెల్లిస్తేనే సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. సిరిసిల్ల నుంచి ఇసుక సరఫరా కావడంతో అధిక ధరలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా వెంటనే స్థానిక అవసరాలకు తంగళ్లపల్లి నుంచి ఇసుక సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా డీడీ చార్జీలు కూడా తగ్గించాలని కోరారు. వారానికి రెండు సార్లు స్థానిక అవసరాలకు సరఫరా చేయాలనికోరారు. భవన నిర్మాణం రంగంపై ఆధారపడిన వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక అవసరాలు కాకుండా అక్రమంగా ఇతరప్రాంతాలకు సరఫరా చేస్తే తప్పకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంటనే తంగళ్లపల్లిలో ఇసుక రీచ్ ప్రారంభించి, గృహ నిర్మాణదారులను ఆదుకోవాలని కోరారు. అవసరమైతే ఇసుకను స్థానిక అవసరాలకు ఉచితంగా సరఫరా చేయాలనీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పడిగెల మానస, సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్‌గౌడ్, వైస్‌చైర్మన్ ఎగుమామిడి వెంకట రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య, మాట్ల మధు, వలకొండ వేణుగోపాలరావు, పడిగెల రాజు, ఏసీరెడ్డి రాంరెడ్డి, ఉమ్మారెడ్డి సత్యనారాయణరెడ్డి, పబ్బతి విజయేందర్‌రెడ్డి, పూర్మని లక్ష్మారెడ్డి, గుండు ప్రేమ్ కుమార్, కొయ్యడ రమేష్, బండి జగన్, నవీన్‌రెడ్డి, అమర్‌రావు, అనిల్, కిష్టారెడ్డి, బుస్స లింగం, జగత్, కందుకూరి రామాగౌడ్, తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోనరావుపేట, మే 2 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. రాహుల్ గాంధీ ప్రతిపాదించిన కులగణనను కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని కుల గణన చేపట్టాలని నిర్ణయం తీసుకున్న దాన్ని హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలువురు మంత్రులతో పాటు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ క చ్చకాయల ఎల్లయ్య, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, జిల్లా నాయకులు చేపూరి గంగాధర్, చందనగిరి గోపాల్, గొట్టె రుక్మిణి, నందు గౌడ్, నాలుక సత్యం, కర్రల భాస్కర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లారెడ్డి, వెంగలి వెంకన్న, లింబయ్య, కాంగ్రెస్ నాయకులు సదానందం, భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్ పార్టీని ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా కులగణన సర్వేను ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో పార్టీ విజయంగా భావిస్తూ మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనకయ్య, చింతపల్లి శ్రీనివాసరావు, ఎర్రం రాజు, గాలిపెల్లి స్వామి, కత్తి కనకయ్య తదితరులు ఉన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం..

● వీర్నపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): దేశంలోని జనాభా లెక్కలతో పాటు కుల గణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు మాలోత్ లక్పత్ నాయక్ ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. ప్రధాన మంత్రి మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పిట్ల నాగరాజు, ఉపాధ్యక్షులు మాడుగుల లింబాద్రి, బండారి మహేష్, మాలత్ ప్రకాష్, బోడ వెంకటేష్, భానోత్ పెద్దరాజు, చింతల ప్రశాంత్, మూడవత్ రఘు, మోహన్ ఉన్నారు.

గోపాలమిత్రల గోడు పట్టించుకోరా?

- ఏడు నెలలుగా అందని వేతనాలు - తప్పని ఆర్థిక ఇబ్బందులు



పశువైద్య సేవలు అందిస్తున్న గోపాలమిత్ర(ఫైల్)

ఇల్లంతకుంట, మే 2 (ఆంధ్రజ్యోతి) : పశువులను పెంచేవారికి సహాయం అందించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన గోపాలమిత్రలకు వేతనాలు లేక నెలలు గడుస్తున్నాయి. అన్ని ప్రాంతాల్లో పశువైద్యశాలలు అందుబాటులో ఉండవని భావించిన ప్రభుత్వం గోపాలమిత్రలను ఏర్పాటు చేసింది. వీరికి నెలకు రూ.11వేలు చెల్లిస్తుంది. వీరు పశుసంవర్ధకశాఖ చేపట్టే అన్ని కార్యక్రమాలలో భాగస్వాములు అవుతుంటారు. పశువులకు ప్రాథమిక చికిత్సలు అందించడం, జీవాలకు టీకాలు వేయడంతో ఎదకు వచ్చిన పశువులకు కృత్రిమ గర్భధారణ కార్యక్రమాలు చేస్తుంటారు. పశువుల్లో కృతిమ గర్భధారణ చేస్తే రూ.100 ప్రోత్సాహకం అందిస్తుంది. వీరి వేతనాలను లైవ్‌స్టాక్ ఏజెన్సీ ద్వారా అందిస్తుంది. వేతనాలు, ప్రోత్సాహకాలు అందక ఏడు నెలు గడుస్తుండటంతో గోపాలమిత్రలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 5,590ఆవులు, ఎద్దులు, 7,397గేదెలు, 56,216 మేకలు, 14,119 గొర్రెలు ఉన్నాయి. పశువైద్య కేంద్రాలు రెండు మాత్రమే ఉండటంతో గోపాలమిత్రలపై పనిభారం ఎక్కువగా పడుతోంది. సరైన సమయానికి వేతనాలు రాకపోవడం వల్ల తీవ్ర ఇబ్బంది అవుతుందని, ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచడంతోపాటు సరైన సమయానికి ఇవ్వాలని కోరుతున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి..

- గంట రంజాన్, గోపాలమిత్ర, ఒబులాపూర్



గోపాలమిత్రలకు ఏడు నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బంది అవుతుంది. పశువులకు కృత్రిమ గర్భధారణ చేస్తే ఇచ్చే ప్రోత్సాహకాలు సైతం ఇవ్వడంలేదు. గాలికుంట, నట్టలనివారణ మందులు తదితర పనులవల్ల భారం మాత్రం పెరుగుతోంది. అనేక సంవత్సరాలుగా ఇదే పనిచేస్తున్నాం. ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచడంతో పాటు సరైన సమయానికి చెల్లించాలి. గోపాలమిత్రలు తక్కువగా ఉన్నందున మరికొంత మందిని తీసుకోవాలి.

పులి సంచారంపై ప్రజలకు అవగాహన

చందుర్తి మే 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల-రాజన్న సిరిసిల్ల జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తోందని, అటవీ ప్రాంతం వైపు వెళ్లే ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని వేములవాడ డిప్యూటీ రేంజ్ అధికారి రాఘవేందర్ రావు పేర్కొన్నారు. హైకాస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సాయి వైష్ణవ్, సాయి సాహెబ్‌రావుల ఆధ్వర్యంలో శుక్రవారం చందుర్తి మండలం కేంద్రంతో పాటు లింగంపేట, మల్యాల గ్రామాల ప్రజలకు పులి సంచారంపై అవగాహన శుక్రవారం కల్పించారు. అటవీ ప్రాంతంలోకి వెళ్లే ప్రజలు తెల్లవారిన తర్వాత వెళ్లి చీకటి పడే లోపు గ్రామాల్లోకి చెరుకోవాలన్నారు. పులి వన్యప్రాణి కావడంతో రాత్రిపూట చురుకుగా సంచరిస్తుందని తెలిపారు. అంతేకాకుండా ఆహారం దొరక్కపోతే పొద్దంతా ఆవేశ సంచారం సాగిస్తాయని అటవీప్రాంతంలోకి వెళ్తే అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. చందుర్తి, రుద్రంగి, వేములవాడ రూరల్ మండలాల్లో అటవీ ప్రాంతాలను అనుకుని, జగిత్యాల జిల్లాలోని కొడిమ్యాల, మేడిపల్లి, భీమారం మండలాలల్లో అటవీప్రాంతాల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారి బాలకృష్ణ, బేస్ క్యాంపు సిబ్బంది, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో ఆరుగురికి జైలు శిక్ష

చందుర్తి, మే 2 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వాహనాలు నడిపి డ్రంకెన్ డ్రైవ్ కేసులో పోలీసులకు పట్టుబడిన ఆరుగురికి వేములవాడ ప్రథమ శ్రేణి న్యాయస్థానం మేజిస్ట్రేట్ ప్రవీణ్ జైలుశిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించారని చందుర్తి ఎస్సై అంజయ్య శుక్రవారం తెలిపారు. వాహనాల తనిఖీలో చందుర్తి పోలీసులకు పట్టుబడిన వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేటకు చెందిన ఇరుమల మహిపాల్‌కు, కథలాపూర్ మండలం తుర్తి గ్రామానికి చెందిన తుపాకుల భూమయ్యకు, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మెస్త్రం దినేష్‌లకు 2రోజుల చొప్పున, వేములవాడ రూరల్ మండలం మారుపాకకు చెందిన ముత్యాల వెంకటేష్‌కు, చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన గడం రతీష్‌లకు 3రోజులు, రుద్రంగి మండల కేంద్రానికి చెందిన గుంజె జలెందర్‌కు 4 రోజులపాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పును ఇచ్చారని చందుర్తి ఎస్సై అంజయ్య తెలిపారు

ట్రాక్టర్ యూనియన్ కార్యవర్గం

కోనరావుపేట, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుద్దాల గ్రామ ట్రాక్టర్ యూనియన్ కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా నీరటి సంజీవ్, ఉపాధ్యక్షుడిగా సుంకరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా చిట్యాల బాబు, సలహాదారుడు మంగళగిరి శ్రీనివాస్, ఎరవెల్లి నరేష్‌లు ఎన్నికయ్యారు.

చికిత్స పొందుతున్న వ్యక్తికి పరామర్శ



పరామర్శిస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

రుద్రంగి, మే 2 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలోని దసరా నాయక్ తండాకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు లావుడ్య మోహన్ అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా బీఆర్‌ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మోహన్ ఆరోగ్య పరిస్థితిని ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.